ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

# టీ-మీడియా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 35
సంచిక : 35
పేజీలు : 4

శనివారం 13 సెప్టెంబర్, 2025

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ


## ఈవిఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**టీ మీడియా, సెప్టెంబర్ 12, ఖమ్మం:**



త్రైమాసిక తనిఖీల్లో భాగంగా కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఈ.వి.ఎం. గోడౌన్ ను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి శుక్రవారం తనిఖీ చేశారు. ముందుగా ఈవిఎం గోడౌన్ సీల్ ను పరిశీలించి రాజకీయ ప్రతినిధులు, అధికారుల సమక్షంలో సీల్ తీసి లోపలికి వెళ్లి, ఈ.వి.ఎం., వి.వి.ప్యాట్లు ఉన్న గది లోపల పరిశీలన చేసి తిరిగి సీల్ వేయించారు. ఫైర్ అలారం పరిశీలించారు. తనిఖీ రిజిస్టర్ లో జిల్లా కలెక్టర్ సంతకం చేసి, మాట్లాడారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ఎం.ఏ. రాజు, కలెక్టరేట్ ఎన్నికల డిటి అన్సారీ, రాజకీయ పార్టీ ప్రతినిధులు ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి పి. శ్రీనివాస్, బిజెపి పార్టీ ప్రతినిధి జి. విద్యాసాగర్, సి.పి.ఐ.(ఎం.) పార్టీ ప్రతినిధి ఎస్. నవీన్ రెడ్డి, బి.ఆర్.ఎస్. పార్టీ ప్రతినిధి ఎల్. సతీష్, టి.డి.పి. పార్టీ ప్రతినిధి పి. కృష్ణప్రసాద్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ఏ. గోపాల్ రావు, బిఎస్ పి పార్టీ ప్రతినిధి సిహెచ్. నాగేశ్వరరావు,అధికారులు, తదితరులు ఉన్నారు.

# ఆదర్శ మార్కిస్ట్ చిర్రావూరి



**వరుసగా నాలుగు సార్లు మున్సిపల్ చైర్మన్** | **అవినీతి మచ్చలేని పాలన ఆయన సొంతం**

## నేడు ఖమ్మంలో వర్ధంతి

**టీ మీడియా, సెప్టెంబర్ 12,ఖమ్మం బ్యూరో:**

ఖమ్మం తెలంగాణ రాష్ట్రంలోని చారిత్రక నగరాల్లో ఒకటి, దాదాపు 1,000 సంవత్సరాల చరిత్ర కలిగినది. ఇది జిల్లాకు ప్రధాన కార్యాలయం. ఈ పట్టణం మార్చి 24, 1942న మునిసిపాలిటీగా ఏర్పడింది 1901 నుండి 1981 వరకు ఖమ్మం పట్టణం తొమ్మిది వేల జనాభా కలిగిన చిన్న పట్టణం నుండి లక్ష మంది జనాభా కలిగిన నగరంగా అభివృద్ధి చెందింది. 1942 లో ఈ పట్టణం మునిసిపాలిటీగా ఏర్పడింది. 1952 నుండి 1987 వరకు దాని సంస్థను ఎన్నుకోవడానికి ఐదుసార్లు ఎన్నికలు జరిగాయి. ఖమ్మం మొదటి మున్సిపల్ చైర్మన్ చిర్రావూరి లక్ష్మీనరసయ్య వంటి స్వాతంత్ర్య పోరాటంలో భాగమైన అనేక మంది నాయకులను ఖమ్మం చరిత్ర సృష్టించింది.

ఖమ్మం మున్సిపాలిటీపై చిర్రావూరి చెరగని ముద్ర వేశారు ఆయన ప్రాథమికంగా మార్క్సిస్ట్. చిర్రావూరి లక్ష్మీనర్సయ్య రాజకీయ జీవితంలో ఆయన జీవితంభారత కమ్యూనిస్ట్ పార్టీ (మార్క్సిస్ట్) గా ఉన్నారు. 1966 – 1992 మధ్య వరుసగా నాలుగు సార్లు మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన చిర్రావూరి ఒక రకమైన రికార్డును కలిగి ఉండటమే కాకుండా చాలా మంది నాయకులకు ఒక మార్గదర్శిగా నిలుస్తారు. 1987లో మున్సిపల్ చైర్మన్ పదవికి జరిగిన ఎన్నికలు తప్ప, మిగతా అన్ని ఎన్నికలు పరోక్షంగా జరిగాయి, ఈ ప్రాంతంపై కమ్యూనిస్టుల ఆధిపత్యం చాలా వరకు చెక్కుచెదరకుండా ఉంది. 1915 మార్చి 20న ఖమ్మం సమీపంలోని కైకొండాయిగూడెంలో ధనిక మరియు విద్యావంతులైన కుటుంబంలో జన్మించిన చిర్రావూరి స్వాతంత్ర్య పోరాటంలో మరియు తరువాత తెలంగాణ సాయుధ పోరాటం (రైతుల సాయుధ తిరుగుబాటు)లో పాల్గొనడం ద్వారా చరిత్రలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారు. 1952లో తొలిసారిగా ఆయన ఖమ్మం మున్సిపల్ చైర్మన్ అయ్యారు. రైతుల సాయుధ పోరాటానికి సంబంధించిన కేసులను ఎదుర్కొంటూ, జైలు నుండే నామినేషన్ పత్రాలను దాఖలు చేసి, వార్డు సభ్యుడిగా ఎన్నికయ్యారు. 1962లో చైనా యుద్ధం, 1976లో అత్యవసర



పరిస్థితి మరియు ఇతర కారణాల వల్ల జైలు జీవితం మినహా, ఆయన చురుకుగా పనిచేసి ప్రజలకు పారదర్శకమైన మరియు సమర్ధవంతమైన పరిపాలనను అందించారు. ఆయన పాలనలో, ముఖ్యంగా తాగునీటి సమస్యపై దృష్టి సారించిన అనేక అభివృద్ధి పనులు జరిగాయి. ఆయన సెప్టెంబర్ 13, 2006న మరణించరు .ఆయన క్రియాశీల రాజకీయాల్లో ఉన్నంత కాలం, కాంగ్రెస్ మున్సిపల్ చైర్మన్ పదవిని గెలుచుకుంటుందని కలలో కూడా ఊహించలేదు. చివరికి 1995 లో, కాంగ్రెస్ కు చెందిన రాపర్తి రంగారావు ఆ పదవిని కైవసం చేసుకోవడానికి కుట్ర పన్నాడు. కానీ 2005 లో సీపీఎం మళ్ళీ చైర్ పర్సన్ పదవిని తిరిగి పొందింది. యాదృచ్ఛికంగా, 2012 లో మునిసిపాలిటీ కార్పొరేషన్ గా అప్ గ్రేడ్ కావడానికి ముందు సీపీఎం కు చెందిన అఫ్రోజ్ సమీనా చివరి మున్సిపల్ చైర్ పర్సన్.

# సోషల్ మీడియా తప్పుడు వార్తలను నమ్మకండి

- సాయిరాం హాస్పిటల్ నిర్వాహకులు
- డాక్టర్ జంగాల సునీల్ కుమార్

**టీమీడియా, టీ మీడియా సెప్టెంబర్ 12 , ఖమ్మం**




తాగూర్ సీన్ రిపీట్ – మృతదేహానికి చికిత్స" అంటూ సోషల్ మీడియాలో వచ్చిన తప్పుడు వార్తలను నమ్మవద్దని, అటువంటి తప్పుడు వార్తలు రాసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్టు ఖమ్మంలోని సాయిరాం ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ జంగాల సునీల్ కుమార్ అన్నారు. ఐఎంఏ నాయకులతో కలిసి ఖమ్మం ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ జంగాల సునీల్ కుమార్ మాట్లాడుతూ... సాయిరాం హాస్పిటల్ పై కొందరు వ్యక్తులు సోషల్ మీడియాలో తప్పుడు వార్తలను ప్రచురించి ప్రజల్లో అభద్రతాభావాన్ని కలిగించే విధంగా చేయడాన్ని తీవ్రంగా

మిగతా 3లో...

# విప్లవోద్యమ ధృవతార ఏచూరి




## సిపిఐ (యం) జిల్లా కార్యదర్శి నున్నా

**టీ మీడియా, సెప్టెంబర్ 12,ఖమ్మం బ్యూరో:**

భారత విప్లవోద్యమ ధృవతార కామ్రేడ్ సీతారాం ఏచూరి అని సిపిఎం పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు కొనియాడారు. స్థానిక సుందరయ్య భవనంలో సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బండి రమేష్ అధ్యక్షతన జరిగిన సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభలో ఆయన ముఖ్య వక్తగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్తమాన భారత రాజకీయాలను అత్యంత ప్రభావితం చేసిన అతికొద్దిమంది భారత రాజకీయ నాయకులలో సీతారాం ఏచూరి ఒకరు అని ఆయన తెలిపారు. ప్రజా సమస్యలను గుర్తించడంలో, వాటికి పరిష్కార మార్గాలను సూచించడంలో ఏచూరీ తనదైన శైలిలో కృషి చేశారన్నారు. అత్యంత సాధారణ సమస్యల నుండి అత్యంత సంక్లిష్ట సమస్యల వరకు శాస్త్రీయ విశ్లేషణ చేయగల ప్రపంచ ప్రసిద్ధ మార్క్సిస్టు మేధావులలో ఏచూరీ ఒకరని ఆయన అన్నారు.ఏచూరి విద్యార్థి దశ నుంచే ఉద్యమాలకు నాయకత్వం వహించారని ఆయన గుర్తుచేశారు. ప్రపంచంలోకమ్యూనిస్టు పార్టీల బలం తగ్గినా, భారతదేశంలో సీపీఐ(ఎం) ను బలంగా నిలబెట్టడంలో ఏచూరీ కృషి మరువలేనిదని తెలిపారు. ఈ నేపథ్యంలోనే రాజ్యాంగ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లడానికి సీతారాం ఏచూరి జీవితాంతం కృషి చేశారన్నారు. సీతారాం ఏచూరి కృషి వల్ల దేశంలో 28 పార్టీలు ఒకే వేదికపైకి వచ్చాయని, దాని ఫలితంగానే గత ఎన్నికల్లో బీజేపీ తదితర మతోన్మాద శక్తుల బలం బాగా తగ్గిందన్నారని తెలిపారు. భారతదేశంలో మతకల్లోలాలు, తగాదాలు జరిగినప్పుడు మత సామరస్యం కోసం ఏచూరీ బలంగా నిలబడ్డారని తెలిపారు. బీజేపీ

మిగతా 3లో...

# యశోద తీరే సపరేట్

- హైదరాబాద్‌లో వైద్యం..జిల్లాల్లో ప్రెస్ మీట్లు
- పట్టించుకోని వైద్యశాఖ అధికారులు

**టి మీడియా,సెప్టెంబర్ 12, ఖమ్మం జిల్లా బ్యూరో :**




కార్పొరేట్ ఆసుపత్రుల వ్యాపార ధోరణి హద్దులు దాటిపోతోంది. ప్రధానంగా హైదరాబాదులో చికిత్స చేసి, జిల్లాల్లో మీడియా సమావేశాలు ఏర్పాటు చేసి, రోగులను ప్రచారం కోసం వాడుకోవడంపై సర్వత్రా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వైద్యులు చేయాల్సిన పనులు కాకుండా, ప్రచారం కోసం రోగులను, ముఖ్యంగా మైనర్లు, వృద్ధులను ఉపయోగించుకోవడం చట్ట విరుద్ధమని, వారి గౌరవానికి భంగం కలిగిస్తున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వైద్య సేవల కన్నా ప్రచారానికే పెద్ద పీట వేస్తున్న యాజమాన్యాలు, రోగుల గోప్యతను పూర్తిగా విస్మరిస్తున్నాయి. ఇటీవల యశోద హాస్పిటల్స్ నిర్వహించిన ప్రెస్ మీట్ దీనికి పరాకాష్టగా నిలిచింది. ఖమ్మం జిల్లా, ఖమ్మం రూరల్ మండలానికి చెందిన ఒక మైనర్ బాలుడు ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా, అతడికి

మిగతా 3లో...

# మోడీ చిత్రపటానికి పాలాభిషేకం

**టీ మీడియా,సెప్టెంబర్12,చింతూరు :**
మోడీ చిత్రపటానికి బిజెపి జిల్లా మాజీ కార్యదర్శి పాయం వెంకయ్య, చింతూరు మండల మాజీ అధ్యక్షులు డివిఎస్ రమణారెడ్డి( చిట్టిబాబు ) మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కేంద్ర ప్రభుత్వం నిత్యావసర వస్తువుల మీద జీ ఎస్ టి తగ్గించి నందుకు గాను పాలాభిషేకం నిర్వహించారు. జీఎస్టి తగ్గించి పేద ప్రజలకు బిజెపి ప్రభుత్వం మరింత చేరువైందని ఈ సందర్భంగా పాయం వెంకయ్య అన్నారు. నిత్యవసర వస్తువుల మీద ధరలు తగ్గటంతో పేద ప్రజలకు ఊరట కలిగిందని పేర్కొన్నారు. వీటితోపాటు వ్యవసాయ ఎరువులు, పనిముట్లు, రైతులకు కావలసిన అన్ని రకాల పనిముట్లు, వైద్య రంగానికి సంబంధించిన మందుల ధరలు ఈనెల 22 నుంచి తగ్గనున్నాయని రాష్ట్రంలో అన్నిటి మీద



ఉన్న పన్నులు తగ్గించడం ద్వారా రాష్ట్ర అభివృద్ధికి, దేశాభివృద్ధికి ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రత్యేక ప్రణాళిక ద్వారా గొప్ప నిర్ణయం తీసుకున్నారని నిర్ణయం పట్ల తాము హర్షం ప్రకటిస్తున్నట్లు తెలిపారు. నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం ప్రపంచంలోనే మూడో స్థానానికి ఆర్థిక రంగంలో అభివృద్ధి చెందిందని తెలిపారు. రక్షణ రంగంలో దేశాన్ని ప్రపంచ అగ్రభాగాన నిలపటం ద్వారా భారత ప్రజలు గర్వంగా తల ఎత్తుకొని చెప్పుకునే స్థాయికి ఎదిగా రన్నారు. బిజెపి,యన్ ఏ ప్రభుత్వం రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాలతో పాటు పోలవరం నిర్వాసితులకు పూర్తి ప్యాకేజీ అందివ్వ నుందని పేర్కొన్నారు. చిట్టిబాబు మాట్లాడుతూ చింతూరు కేంద్రంగా వంద పడకల ఆసుపత్రి మంజూరు జరిగిందని త్వరలో పనులు ప్రారంభమ వుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బాలాజీ, శ్రీను, మానే వీరబాబు, లక్ష్మి, విశ్వనాథ్, మానిజయ, తెలుగుదేశం నాయకులుపొదిలి రామారావు తదితరులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**టీ మీడియా, సెప్టెంబర్ 12,సింగరేణి(కారేపల్లి):**



కారేపల్లి క్రాస్ రోడ్ లోని 33/11 కేవీ సబ్ స్టేషన్ నందు మరమ్మతులు కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి తెలిపారు. 11 కేవీ కారేపల్లి టౌన్, 11 కేవీ విశ్వనాథపల్లి ఫీడర్, 11 కేవీ కారేపల్లి రూరల్ ఫీడర్, 11కేవీ గాంధీనగర్ ఫీడర్ కు సంబంధించిన గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులందరూ సహకరించాలని ఏఈ కోరారు.

# విద్యుత్ సరఫరాలో అంతరాయం

**టి మీడియా, సెప్టెంబర్ 12, పినపాక ప్రతినిధి:**
నేడు,రేపు ( శనివారం, ఆదివారం) 33కేవీ ఏడూళ్ళ బయ్యారం ఫీడర్ లో రెండవ 33కేవీ లైన్ పని జరుగుతున్నందున , 33కేవీ పవర్ సప్లై ఎ కె మల్లారం నుండి తీసుకోవడం జరుగుతుంది.అందుకని పినపాక మరియు కరకగూడెం మండలాల పరిధి లోని అన్ని ఏరియాలలో నేడు ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం12 గంటల వరకు, రేపు ఉదయం 9గంటల నుండి ఒంటి గంట వరకుత్రీ ఫేజ్ కరెంటు సరఫరా నిలిపివేయబడుతుందని పినపాక విద్యుత్ శాఖ ఏఈ జి వేణుగోపాల్ తెలిపారు. సింగిల్ ఫేజ్ కరెంటు మాత్రమే ఉంటుందన్నారు. త్రీ ఫేజ్ విద్యుత్ వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

# బదిలీపై వెళ్తున్న రికార్డ్ అసిస్టెంట్లకు సన్మానం

**టి మీడియా, సెప్టెంబర్ 12,పినపాక ప్రతినిధి:**



అశ్వాపురం తహసిల్దార్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్లుగా పనిచేస్తూ జీపీవోలుగా బదిలీపై వెళుతున్న ఉద్యోగులకు శుక్రవారం అశ్వాపురం తహసిల్దార్ మణిధర్, కార్యాలయ సిబ్బంది శాలువాలతో ఘనంగా సన్మానించి సత్కరించి వీడ్కోలు పలికారు. సిరిసిల్ల జిల్లాకు చెందిన వై మురళీధర్ రావు,మన్నెం మల్లేష్ ఇరువురు ఉద్యోగులు అశ్వాపురం తహసిల్దార్ కార్యాలయంలో రెండు సంవత్సరాల కాలం పాటు రికార్డు అసిస్టెంట్లుగా పనిచేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్రామ పరిపాలన అధికారుల పోస్టులకు వీరు తిరిగి ఎంపికై వారి సొంత జిల్లాకు వెళ్తున్నారు. ఈ సందర్భంగా వారికి సన్మానం చేశారు.ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ,అశ్వాపురం తహసిల్దార్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్లుగా రెండు సంవత్సరాల పాటు అంకిత భావంతో విధులు నిర్వర్తించిన వారి సేవలను కొని యాడారు. గ్రామ పరిపాలన అధికారులుగా వెళ్తున్న వీరు అక్కడ విధుల పట్ల కూడా అంకితభావంతో పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కనక లక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ నరసింహారావు, ఆర్ ఐ లు లావణ్య, లీలావతి. ప్రియాంక సర్వేశ్వరరావు. సతీష్, కన్నమ్మ, వెంగళరావు, ముత్యం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన డిగ్రీ బాలుర కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

**టి మీడియా, సెప్టెంబర్ 12,పినపాక ప్రతినిధి:**



అశ్వాపురం మండల పరిధిలోని మిట్ట గూడెంలో వున్న తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ గురుకుల బాలుర డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం నందు చేరుటకు ఈనెల 15,16 తేదీలలో స్పాట్ అడ్మిషన్ ప్రక్రియ నిర్వహించ బడుతుందని కళాశాల ప్రిన్సిపాల్ బండారుపల్లి రవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన విద్యార్థులు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించిన, లేదా తత్సమాన అర్హత కలిగిన గిరిజన విద్యార్థులు తమ యొక్క ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా కళాశాలలో సమర్పించి అడ్మిషన్ పొందగలరని ఆయన కోరారు. అర్హత కలిగిన గిరిజన విద్యార్థులైన అభ్యర్థులు ఈ యొక్క చివరి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



# మెనూ ప్రకారం భోజనం

- **ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి**

**టీ మీడియా, సెప్టెంబర్ 12,ఖమ్మం :**
వాతావరణం మార్పు వలన మరియు వర్షాలు కురుస్తున్నందున గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినిలకు వారి ఆరోగ్య పరిరక్షణతో పాటు మెనూ ప్రకారం సమయానుకూలంగా భోజనం అందించాలని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ అన్నారు. శుక్రవారం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లా లోని గోల్లగూడెం గ్రామంలో ఉన్న గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పాఠశాలలోని పరిసరాలు మరియు వంటగది సామాన్లు నిలువ చేసే స్టోర్ రూమ్, డార్మెటరీ, డైనింగ్ హాల్ పరిశీలించి నూతనంగా ప్రవేశపెట్టిన మెనూ ప్రకారము సమయానుకూలంగా ఆహార పదార్థాలు అందిస్తున్నది లేనిది విద్యార్థినీలను అడిగి తెలుసుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థినిలకు చదువుతోపాటు మంచి పౌష్టికరమైన ఆహారం అందించాలని, వర్షాకాలం నడుస్తున్నందున పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని రాత్రిపూట విద్యార్థినిలు ఎవరు బయటకు రాకూడదని, విషపూరితమైన క్రిమి కీటకాలు సంచరించవచ్చని అందుకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్ఎం కు ఆదేశించారు.ఆశ్రమ పాఠశాలలో చదివే విద్యార్థినీ విద్యార్థులకు ఆరోగ్యరీత్యా ప్రత్యేక వైద్య పరీక్షలు చేయడానికి ఆశ్రమ పాఠశాలలో పనిచేసే ఏఎన్ఎం లకు సరఫరా చేసిన మెడికల్ కిట్లను పరిశీలించి విద్యార్థినిలు ఎవరైనా అస్వస్థతకు గురి అయితే వెంటనే వైద్య చికిత్సలు అందించాలని, ప్రతిరోజు విద్యార్థినిల యొక్క ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని ఏఎన్ఎం కి సూచించారు. అనంతరం ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి డైలీ వేజ్ వర్కర్లు ఈరోజు నుంచి సమ్మెలో పాల్గొంటున్నందున విద్యార్థినిలకు సమయానుకూలంగా వంట చేసి పెట్టడానికి కొత్తవారిని తాత్కాలికంగా నియమించుకోవాలని, అలాగే 33 మంది విద్యార్థినిలు పాఠశాలకు గైర్హాజరైనందున వెంటనే వారి ఇండ్లకు వెళ్లి తల్లిదండ్రులను ఒప్పించి పాఠశాలకు వచ్చేలా చూడాలని అన్నారు. విద్యార్థినిల ఆరోగ్యం పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోని వారి చదువుకు భంగం కలగకుండా చూడాలని, వంట చేసే సిబ్బంది పరిశుభ్రతను పాటించాలని, వంట చేసిన తర్వాత విద్యార్థినిలకు సరఫరా చేసేముందు హెచ్ఎం మరియు ఉపాధ్యాయులు తిన్న తర్వాతనే వారికి వడ్డించాలని అన్నారు. అనంతరం పదవ తరగతి పిల్లలకు బోధిస్తున్న పాఠ్యాంశాలను పరిశీలించి, ఏడవ తరగతి విద్యార్థినిలతో ఉద్దీపకం వర్క్ బుక్ టూ సంబంధించిన అంశాలను బోర్డుపై వ్రాయించి వాటి వివరణ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్యామరావు, వార్డెన్ రామకుమారి తదితరులు పాల్గొన్నారు.

# సీతారాం ఏచూరి ఓ విప్లవోద్యమ ధృవతార

- **సిపిఐ (ఎం) జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి కృష్ణ**

**టీ మీడియా, సెప్టెంబర్ 12, కొణిజర్ల :**



మండల కేంద్రంలో సంక్రాంతి రామచంద్రయ్య భవన్ లో మోత్కూరి వెంకటేశ్వరరావు అధ్యక్షతన సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభ నిర్వహించారు. సీతారాం ఏచూరి చిత్రపటానికి సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు కొప్పులు కృష్ణయ్య పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు మాట్లాడుతూ కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణించి అపుడే సంవత్సరకాలం అయిందా. ఈ సంవత్సరకాలంలో ఆయన లేని లోటు సిపిఐ(ఎం) పార్టీకి ఈ దేశానికి స్పష్టంగా తెలియ వచ్చింది అని అన్నారు.మనదేశంలో ఎన్నో త్యాగాలతో, జీవితానుభవముతో సాధించుకున్న లౌకిక భావన ఒమ్ము కావడాన్ని సహించడం అనేది మన దేశ చరిత్రకు అపచారం అవుతుంది అని. దేశ సమైక్యతకు విఘాథం కలుగుతుంది. అందుకే లౌకిక విలువలను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన అవసరం మనందరి మీద ఉన్నదని, సోషలిజం కోసం జరిగే పోరాటంలో లౌకిక విలువలను కాపాడుకోవడం ఒక ముఖ్య భాగం అని నమ్మి జీవితాంతం కృషి చేసిన కామ్రేడ్ సీతారాం కి ఆ కృషిని కొనసాగించటమే మనం అర్పించగల నిజమైన నివాళి అని అన్నారు. . ఈ దేశంలో మతోన్మాదులు ఆర్ఎస్ఎస్, బిజెపి ప్రమాదాన్ని తీవ్రతని మొట్టమొదట గుర్తించినటువంటి వ్యక్తి కామ్రేడ్ సీతారాం. మతోన్మాదం పట్ల మన దేశం ఎల్లడల జాగ్రత్తగా ఉండాలి అని నిరంతరం చెప్తూ ఉండేవారు అని. ఇవాళ చూస్తున్నాం మనం మతోన్మాద ప్రమాదం ఈ దేశంలో ఏ విధంగా విస్తరించిందో రాజ్యాంగ సంస్థలని రాజ్యాంగ విలువలని తుంగలో తొక్కి ఒక పెద్ద తొండాట ఆర్ఎస్ఎస్, బిజెపి దేశంలో ఆడుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) మండల కమిటీ సభ్యులు మోత్కూరు వెంకటేశ్వరరావు, లింగాల చిన్నదానయ్య తేజోతి సీతారాములు, తాతా వెంకయ్య, పురం నరేష్, పుప్పాల రమేష్, షేక్ సైదా, మర్రి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియా తప్పుడు వార్తలను నమ్మకండి

(మొదటిపేజీ తరువాయి...)

పరిగణిస్తున్నామని అన్నారు. 13 సంవత్సరాల బాలుడు కామెర్లు, తీవ్రమైన లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతూ నాటు వైద్యం తీసుకుంటూనే హైదరాబాద్ స్థాయిలో అనేక ఆసుపత్రులు చుట్టూ తిప్పారని, కొన్ని రోజులపాటు ఓ దేవాలయంలో ఉంచారని పేషంట్ కండిషన్ తీవ్రతరం కావడంతో తమ ఆసుపత్రికి తీసుకొచ్చారని తెలిపారు. ఆ సమయంలో ఐసీయూలో ఉన్న పేషెంట్ బ్రతికే ఉండి కాళ్లు చేతులు ఆడించటం పేషంటు బంధువులు చూశారని తెలిపారు. దానికి సంబంధించిన వీడియోలు కూడా బంధువులకు చూపించామని రోగి తీవ్రవిషమ పరిస్థితిలో ఉండడంతో మెరుగైన వైద్యం కోసం వేరే ఆసుపత్రికి తీసుకు వెళ్ళమని రిఫర్ చేశామని తెలిపారు. పేషెంట్ ను తీసుకు వెళుతున్న క్రమంలో మార్గమధ్యమంలో చనిపోయాడని తెలిపారు. తమ ఆసుపత్రి పై తప్పుడు ప్రచారం చేసేందుకు "ఠాగూర్ సినిమా రిపీట్ – మృతదేహానికి చికిత్స" అంటూ సోషల్ మీడియా గా అసత్య ప్రచారం చేశారని, తప్పుడు వార్తలు రాశారని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పుడు వార్తలు రాసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఐఎంఏ నాయకులు డాక్టర్ కంభంపాటి నారాయణరావు, డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్ లు మాట్లాడుతూ...డాక్టర్లు తమ వృత్తి ధర్మంలో భాగంగా పేషంటును బతికించడానికి ప్రయత్నం చేస్తారే తప్ప ప్రాణాలు తీయడానికి కాదని అన్నారు. పేషంటు పరిస్థితి ఆందోళనకరంగా ఉందని బాధితులకు ముందే చెప్పడం జరిగిందని, జరిగిన పరిణామంపై డాక్టర్లను దోషులుగా చిత్రీకరించాలనుకోవడం మంచి పద్ధతి కాదన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా, వివరణ తీసుకోకుండా ఆసుపత్రులు, డాక్టర్లపై తప్పుడు వార్తలు రాసి బదనాం చేయాలనుకోవడం అవివేకం అని, అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు, డాక్టర్ జంగాల స్వాతి, డాక్టర్ విజస్ వర్మ, డాక్టర్ సుజేంద్ర రెడ్డి, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ రవికుమార్, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

# యశోద తీరే సపరేట్

(మొదటిపేజీ తరువాయి...)

హైదరాబాదులోని యశోదలో చికిత్స అందించారు. వైద్యం అనంతరం, ఆ బాలుడిని ఖమ్మంలోని మీడియా ముందుకు తీసుకువచ్చి, ఆత్మహత్యాయత్నం వివరాలను బహిరంగంగా వెల్లడించారు. ఇది బాలల హక్కుల చట్టం ప్రకారం తీవ్రమైన నేరం. ఇలాంటి కేసుల్లో పోలీసులకు సమాచారం ఇవ్వాల్సి ఉన్నా, యాజమాన్యం ఆ విషయాన్ని గోప్యంగా ఉంచి, కేవలం ప్రచారం కోసం ఈ చర్యకు పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇదే తరహాలో ఒక వృద్ధ మహిళను కూడా మీడియా ముందు ప్రవేశపెట్టి, ఆమె అనారోగ్య వివరాలను బయటపెట్టారు. సాధారణంగా ఇలాంటి విషయాలు వైద్య పరంగా గోప్యంగా ఉంచాలి. కానీ యశోద ఆసుపత్రి యాజమాన్యం తమ వ్యాపార ప్రయోజనాల కోసం రోగుల గౌరవాన్ని పణంగా పెడుతోంది. దీనివల్ల బాధితులు భవిష్యత్తులో సామాజికంగా అనేక అవమానాలను ఎదుర్కొని, ఏదైనా జరగరానిది జరిగితే అందుకు ఎవరు బాధ్యత వహిస్తారనే ప్రశ్నలు వ్యక్తం అయితున్నాయి.

మరోవైపు, యశోదా లాంటి కార్పొరేట్ హాస్పిటల్స్ భారీగా ఫీజులు వసూలు చేస్తున్నాయని బాధితులు వాపోతున్నారు. ప్రెస్ మీట్లలో యశోద ఆస్పత్రి నిర్వాహకులు కేవలం వైద్య సేవల గురించి మాత్రమే మాట్లాడి, ఫీజుల గురించి ప్రస్తావించడం లేదు. పీఆర్ఓలను ఉపయోగించి మీడియాను మేనేజ్ చేయడం, ఎదురు ప్రశ్నలు వేసినవారిని బెదిరించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని కూడా ఆరోపణలు వస్తున్నాయి. తమది కార్పొరేట్ సంస్థ అధికారులను మ్యానేజ్ చేస్తాం, మీ సంగతి చూస్తా అంటు ఒక పీఆర్ఓ సీనియర్ మీడియా ప్రతినిదిని బెదిరించడం వీరి ఆగడాలకు పరాకాష్ట. పీఆర్ఓలు కొంతమంది మీడియా మ్యానేజ్ పేరుతో యాజమాన్యం వద్ద భారీగా నొక్కేస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది. ఈ మొత్తం వ్యవహారంపై వైద్యశాఖ అధికారులు, పోలీసులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఇది కేవలం ఒక ఆసుపత్రికి సంబంధించిన సమస్య కాదు, యావత్తు కార్పొరేట్ వైద్య రంగంలో పెరుగుతున్న అవినీతి, అనైతిక పోకడలకు అద్దం పడుతోందని ప్రజలు అంటున్నారు.

# విప్లవోద్యమ ధృవతార సీతారాం ఏచూరి

(మొదటిపేజీ తరువాయి...)

మనుధర్మ శాస్త్రాన్ని రాజ్యాంగంగా మలచాలని ప్రయత్నిస్తున్న నేపథ్యంలో ఆ ప్రమాదాన్ని ఏచూరీ పసిగట్టారన్నారు. ఏచూరీకి నిజమైన నివాళి అర్పించడం అంటే రాజ్యాంగంలోని సోషలిజం, ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడుకోవటమని, కార్పొరేట్ మతతత్వ రాజకీయాలను వ్యతిరేకించడమని, అందుకు అవసరమైన ప్రజా ఉద్యమాలను, పోరాటాలను నిర్వహించడమని అన్నారు.

ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు మాచర్ల భారతి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదినేని రమేష్, యర్రా శ్రీనివాసరావు, బండి పద్మ, జిల్లా కమిటీ సభ్యులు నందిపాటి మనోహర్, బండారు రమేష్, మెరుగు సత్యనారాయణ, దొంగల తిరుపతిరావు, పి.రమ్య, బషీర్‌ఉద్దీన్, మెరుగు రమణ, బివికె వై.శ్రీనివాసరావు, ఆర్.ప్రకాష్, పగడాల నాగేశ్వరరావు, సదానందం, నామా లక్ష్మీనారాయణ, వాసిరెడ్డి వీరభద్రం, బివికె నాగేశ్వరరావు తుడుం ప్రవీణ్, పి. సుధాకర్, ఉషోదయ లక్ష్మీనారాయణ, చింతల రమేష్, బొడ్డు మధు, జక్కంపూడి కృష్ణ, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

# చిరునవ్వుయుడు చిర్రావూరి



- **మాటూరు లక్ష్మీనారాయణ రావు (మాజీ మున్సిపల్ కౌన్సిలర్)**

**టీ మీడియా, సెప్టెంబర్ 12, ఖమ్మం**

చిర్రావూరి లక్ష్మీ నరసయ్య గారితో నా అనుబంధం చిరునవ్వుయుడు ప్రజల మనిషి చిరావూరి వర్ధంతి సందర్భంగా స్మరించుకోవడం అదృష్టంగా భావిస్తున్నాను ఆ మహానుభావులతో నాకు చిన్న వయసు నుండి ఆ కుటుంబాలతో పరిచయం ఉన్నది నేను విద్యార్థి దశలో ఉండగానే 19 74 లో నేను చిర్రావూరి గారు మంచిగంటి గారితో కలిసి వరంగల్ సెంట్రల్ జైల్లో 15 రోజులు ఉన్నాను చేతులకు బేడీలు వేసి ఖమ్మం టౌన్ లో తిప్పారు వారితో ఇది చాలా అనుబంధ నేర్పరచింది జైల్లో రాజకీయాలు కూడా నేర్చుకున్నాను జనరల్ గా మా కుటుంబం తెలంగాణ సాయుధ పోరాటం వారసత్వ కుటుంబంగా వస్తుం ఉన్నది మా నాన్నగారి తెలంగాణ సాయుధ పోరాటంలో పనిచేశారు మా అన్నయ్య గారు రామచంద్ర రావు గారు విద్యార్థి యువజన కార్మిక ఉద్యమాలకు ఈ జిల్లాలో నిర్మాణ కృషికి పనిచేస్తూ వచ్చారు ఆ విధంగా కుటుంబాలని మాకు దగ్గరగా ఉండి చిరావూరి గారు మంచి పరిపాలన దక్షులు దాదాపు 40 సంవత్సరాలు ఏలిన మహానుభావులు ఆయన గారి హయాంలోనే ఖమ్మం నగరం అనేక రూపురేకల్ దిద్దుకోండి వారి టైంలో 19 87 లో నేను కౌన్సిలర్ గా చేసే అవకాశం దొరికింది నాకు దగ్గరుండి వారి పరిపాలన చూసి అవకాశం లభించడం వారితో పని చేసే అదృష్టం దక్కింది అప్పుడే మంచి గంటి ఎమ్మెల్యేగా ఉన్నారు దానవాయిగూడెం వాటర్ ఫిల్టర్ బెడ్ నరసింహ స్వామి గుట్ట రిజర్వాయర్ జమ్మిబండా రిజర్వాయర్ గుట్టల బజార్ రిజర్వాయర్ ఓల్డ్ పంపింగ్ గర్ల్ ఫిల్టర్ బెడ్డు ఇప్పుడున్న బైపాస్ రోడ్డు మమత హాస్పిటల్ బైపాస్ రోడ్డు రంగనాయకులపేట కాలవడ్డు పేట వరకు 50 ఫీట్ రోడ్డు అప్పుడు అంకురార్పణ జరిగినవి ప్రజలకు మంచినీటి విషయంలో ఎప్పుడూ ఇబ్బందులు కలగ లేదు గాంధీనగర్ చిర్రావూరి నగర్ ప్రాంతాల్లో అనేకమంది పేదలకు ఇళ్ల స్థలాలు ఆయన గారి హయాంలోని ఇచ్చారు అవన్నీ మున్సిపల్ స్థలాలు అదేవిధంగా చెరువు బజార్ దగ్గర ఉన్న ఎల్ఐ జిహెచ్ కోటర్స్ మావిళ్ళగూడెం లో ఉన్న మున్సిపల్ కోటర్సు గుట్టల బజార్ లో ఉన్న మున్సిపల్ కోర్టర్స్ ఆయన టైం లోనే కట్టి మధ్యతరగతి వారికి తక్కువ రేట్లలో నెలకు 500 చూపును కట్టించుకుని అలాట్మెంట్ ఇచ్చారు మున్సిపల్ పార్కులకు కూడా ఆయన గారి టైంలోనే అంకురార్పణ జరిగింది అనేక మున్సిపల్ స్థలాలను కాపాటంలో చాలా జాగ్రత్తలు తీసుకున్నారు చాలామంది ఉద్యోగులకు మున్సిపాలిటీలో ఆయన గారి టైములో రూపాయి ఖర్చు లేకుండా ఉద్యోగాలు ఇవ్వటం జరిగింది మొన్నటిదాకా రిటైర్మెంట్ అవుతూ వచ్చారు రాజకీయ పక్షపాతం లేకుండా నిధుల విడుదల అందరి కౌన్సిలర్లకు సమానంగా ఇచ్చేవారు ఎక్కడ రాజకీయ పక్షపాతం ఉండేది కాదు పరిపాలన పరంగా అన్ని పార్టీల కౌన్సిలర్లని సమానంగా చూశారు దానికి కారణం రాజకీయాలు వేరు పరిపాలన వేరు అని చెప్తూ ఉండేవారు అందుకోసమే ఎక్కడా కూడా రాజకీయంగా రాజీ పడేవారు కాదు వారి టైంలో జలగం వెంగళరావు గారు ముఖ్యమంత్రిగా కేంద్ర పరిశ్రమల మంత్రిగా పనిచేశారు అయినా కూడా రాజకీయంగా రాజీ పడకుండా పరిపాలన పరంగా కావాల్సినవి నిధులను తెప్పించుకునేవారు ఆ రకంగా పట్టణాభివృద్ధికి ఆయన చేసిన కృషి చెప్పుకుంటూ పోతే చాలా ఉంటుంది మున్సిపల్ కమ్యూనిటీ హాల్స్ కూడా అప్పుడు గాంధీ పార్కుగా పిలవబడుతున్న కమ్యూనిటీ హాల్ ఆయన గారి టైం లోనే కట్టారు గుట్టల బజార్ వై ఆర్ కె గారి హాస్పటల్ దగ్గర కిన్నెరసాని డౌన్ ఉద్యోగుల కోసం ఇల్లు కట్టించారు రేవతి సెంటర్లో స్లీపర్స్ కాలనీ ఆయన వారి టైంలోనే కట్టి స్లీపర్స్ కొందరికి ఇల్లు కేటాయించారు అంత మహోన్నతమైనటువంటి వ్యక్తి మనకి చరిత్రలో ఎక్కడ దొరకరు ఇంకా చెప్పుకుంటూ పోతే చాలా ఉన్నాయి వారు అభివృద్ధి కార్యక్రమాలు ఈ సందర్భంగా వారిని స్మరించుకుంటున్నాను.

## పుస్తకాల బహూకరణ అభినందనీయం

- **పసుపులేటి వీరబాబు**

**టీ మీడియా, సెప్టెంబర్ 12,ఇల్లెందు :**



ప్రస్తుత సమాజంలో ఉన్నత చదువులు చదివి, పది మంది విద్యార్థులకు ఉపయోగపడేలా వారికి అవసరమైన పుస్తకాలను గ్రంథాలయానికి బహూకరించడం అభినందనీయమని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ పసుపులేటి వీరబాబు అన్నారు. శుక్రవారం ఇల్లెందు పట్టణం జెకె సెంటర్ గ్రంథాలయానికి పట్టణానికే చెందిన అందే శరణ్ అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఎంటెక్ ఎంట్రెన్స్ కు సంబంధించిన విలువైన పుస్తకాలను కొని గ్రంథాలయానికి గ్రంథాలయ చైర్మన్ వీరబాబు సమక్షంలో గ్రంథాలయ బాధ్యులు రుక్మిణికి అందజేశారు. ఈ కార్యక్రమంలో అందే సతీశ్, శ్రీను, ఉపేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఐడిబిఐ వితరణ అభినందనీయం

- **ఎంపీడీఓ శ్రీదేవి**

**టీ మీడియా, సెప్టెంబర్ 12,ఖమ్మం రూరల్ :**



ఖమ్మం రూరల్ మండలంలోని ఎం వెంకటయ్య పాలెం గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఐడిబిఐ భారీ వితరణ చేయడం ఎంతో అభినందనీయమని ఎంపీడీఓ కె. శ్రీదేవి అన్నారు. శుక్రవారం పాఠశాలకు ఖమ్మం ఐడిబిఐ బ్రాంచ్ రూ.2 లక్షల విలువైన కంప్యూటర్లు, ఫ్యాన్లను ఖమ్మం బ్రాంచ్ మేనేజర్ కృష్ణ ప్రసాద్, సూర్యాపేట బ్రాంచ్ మేనేజర్ నాగరాజు అందజేశారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ శ్రీనివాస్ హాజరయ్యారు. తొలుత పాఠశాలలో ఏర్పాటు చేసిన డిజిటల్ లెర్నింగ్ ల్యాబ్‌ను వారు ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలన్నారు.పాఠశాల పురోభివృద్ధికి గ్రామ, ఇతర ప్రముఖులు పూనుకోవడం సంతోషంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో పాఠశాల అభివృద్ధికి ఎలాంటి సహకారం అందించడానికైనా తాము సిద్ధంగా ఉన్నామని ఎంపీడీఓ తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి మంచి ఫలితాలను రాబట్టాలని, తద్వారా తల్లిదండ్రులకు, గ్రామానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐడిబిఐ సిబ్బంది వెంకన్న, శివ, రమేశ్, వెంకట్, గ్రామ పెద్దలు వెంకటరమణ నాగయ్య, నాగేశ్వరరావు, పాఠశాల హెచ్‌ఎం డివిఎన్ ప్రసాద్, ఇతర ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

**టీ మీడియా, సెప్టెంబర్ 12,కామేపల్లి :**

ఖమ్మం జిల్లా కామేపల్లి మండల పరిధిలోని పండితాపురం సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. గార్ల మండలం పాత పోచారానికి చెందిన గాలిన సాయి ప్రకాష్ ఖమ్మం పట్టణంలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. విధులు ముగించుకుని ఖమ్మం నుండి బైక్‌పై స్వగ్రామం పోచారం వెళ్తుండగా పండితాపురం పెట్రోల్ బంక్ సమీపంలో ఖమ్మం –ఇల్లెందు ప్రధాన రహదారిపై సింగరేణి (కారేపల్లి) మండలం భాగ్యనగర్ తండాకు చెందిన ఉమా మహేష్ బైకుపై ఎదురుగా వేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సాయి ప్రకాష్ కాలు, చేతికి గాయాలయ్యాయి. స్థానికులు 108 సహాయంతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



## పల్లె దవాఖాన వైద్యుడు అశోక్ సస్పెండ్

**టీ మీడియా, సెప్టెంబర్ 12,ఆత్మకూరు(ఎం):**

ఆత్మకూరు(ఎం) మండలంలోని కూరెళ్ల ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న పల్లె దవాఖాన డాక్టర్ అశోక్‌ను జిల్లా కలెక్టర్ హనుమంతరావు శుక్రవారం సస్పెండ్ చేశారు. కలెక్టర్ హనుమంతరావు ఆకస్మిక తనిఖీలో భాగంగా కూరెళ్ల పల్లె దవాఖానను తనిఖీ చేయగా డాక్టర్ అశోక్ విధుల్లో లేకపోవడంతో పాటు, ప్రతి రోజు సరిగ్గా విధులకు హాజరు కాకపోవడంతో వెంటనే సస్పెండ్ చేయాలని డీఎంహెచ్‌ఓని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం తుక్కపురంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను ఆయన పరిశీలించి లబ్ధిదారులు ప్రభుత్వం విధించిన గడువులోపు నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. గురువారం కురిసిన భారీ వర్షంతో మండల కేంద్రంలోని బిక్కేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో కలెక్టర్ పరిశీలించి, తగు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ రాములు నాయక్, ఎంపీఓ పద్మావతి, పంచాయతీ కార్యదర్శులు శేఖర్, రాఘవేందర్ పాల్గొన్నారు.



## సీతారాం ఏచూరికి ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల నివాళి

**టీ మీడియా, సెప్టెంబర్ 12,ఖమ్మం:**
ఎస్ఎఫ్ఐ పూర్వ అఖిలభారత అధ్యక్షులు కామ్రేడ్ సీతారాం ఏచూరి మొదటి వర్ధంతిని ఊరు ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల వేదిక ఖమ్మం జిల్లా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు మంచి కంటి భవన్ లో జరిగిన మొదటి వర్ధంతి సభలో ముఖ్యఅతిథిగా ప్రముఖ వైద్యులు ఎలమంచిలి రవీంద్రనాథ్ పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల వేదిక నాయకులు ఎం. సుబ్బారావు కె దేవేంద్ర, పాల్గొన్నారు. ఈ వర్ధంతి సభ కు బాలాజీ సింగ్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఎం ఎ ఖయ్యూం, పాపయ్య, కళ్యాణం వెంకటేశ్వర రావు బుయ్య రాజేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులపై కేసు నమోదు సరికాదు

- తక్షణం ఉపసంహరించుకోవాలి
- టియుడబ్ల్యూజె (ఐజెయు)

**టీ మీడియా, సెప్టెంబర్ 12,ఖమ్మం :**
జర్నలిస్టులపై పోలీసులు కేసులు నమోదు చేయడం సరికాదని తక్షణం కేసును ఉపసంహరించుకోవాలని టియుడబ్ల్యూజె (ఐజెయు) ఖమ్మం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. కొణిజర్ల పోలీసులు టి న్యూస్ జిల్లా రిపోర్టర్ సాంబశివరావు, వీడియో -జర్నలిస్టు నాగరాజు లతో పాటు మరో జర్నలిస్టుపై కేసు నమోదు చేయడాన్ని జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు శుక్రవారం జిల్లా -అధ్యక్ష, కార్యదర్శులు ఏనుగు వెంకటేశ్వరరావు, మైసా పాపారావు ఒక ప్రకటన విడుదల చేశారు. మారిన పరిస్థితుల్లో యాజమాన్యాలు కోరినవిధంగా జర్నలిస్టులు పనిచేయాల్సి వస్తుందని ఈ నేపథ్యంలో పోలీసులు కేసులు నమోదు చేయడం, ఇబ్బందులు పెట్టడం సరైంది కాదన్నారు. కేసును ఉపసంహరించుకోవాలని వెంకటేశ్వరరావు, పాపారావు లు కోరారు.




## 17న ఖమ్మానికి సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

**టీ మీడియా, సెప్టెంబర్ 12,ఖమ్మం :**
ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో 17వ తేదీన నిర్వహించే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల ముగింపు సభకు సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ హాజరవుతున్నట్లు ఆ పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను బీజేపీ వక్రీకరిస్తోందన్నారు. ముస్లిం- హిందూ పోరాటంగా చిత్రీకరిస్తోందని చెప్పారు. స్థానిక సుందరయ్య భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండి రమేశ్, వై.విక్రమ్‌తో కలిసి నున్నా మాట్లాడారు. ఈ సభకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బేబితో పాటు కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, ఇతర నాయకులు హాజరవుతారని తెలిపారు. ఈ సభను విజయవంతం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు.

# సమాజానికి ఆదర్శంగా నిలవాలి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

**టీ మీడియా, సెప్టెంబర్ 12, మణుగూరు:**
ఎన్ సి సి శిక్షణతో దేశభక్తి, క్రమశిక్షణతో సమాజానికి ఆదర్శంగా నిలవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. మణుగూరు మిట్ట గూడెం లోని తెలంగాణ గిరిజన గురుకుల కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్ సి సి క్యాంపు ను జిల్లా కలెక్టర్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా క్యాంప్‌లో శిక్షణ పొందుతున్న ఎన్‌సిసి క్యాడెట్లతో మాట్లాడుతూ, దేశభక్తి, క్రమశిక్షణ, నిబద్ధత వంటి విలువలను జీవితంలో అలవర్చుకోవడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఎన్‌సిసి శిక్షణ ద్వారా క్యాడెట్లు సమాజానికి ఆదర్శప్రాయులుగా ఎదిగి, దేశ నిర్మాణంలో కీలకపాత్ర పోషించాలని ఆయన ఆకాంక్షించారు. ప్రస్తుత కాలంలో విద్యతో





పాటు జిజ్ఞాస, విమర్శనాత్మక ఆలోచన, సహకారం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు ప్రతి విద్యార్థిలో పెంపొందితేనే భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో నిలబడగలరని తెలిపారు. ఎన్‌సిసి ద్వారా లభించే అవకాశాలను ప్రతి క్యాడెట్ వినియోగించుకోవాలని , ఈ శిక్షణ ద్వారా సివిల్ సర్వీసులు, రక్షణ రంగం, ఇతర పోటీ పరీక్షల్లో విజయం సాధించడానికి దోహదం అవుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎస్.కె. భద్ర, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కల్నల్ నవీన్ యాదవ్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ రవి బందారుపల్లి, తహశీల్దార్, ఎంపిడిఓ, ఎంపిఓలు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పత్తి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోళ్లు

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

**టీ మీడియా, సెప్టెంబర్ 12,ఖమ్మం:**
పత్తి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగజేయకుండా నాణ్యమైన పత్తిని మద్దతు ధరపై కొనుగోలుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో 2025-26 పత్తి సీజన్ లో సిసిఐ చే పత్తి కొనుగోలుపై అధికారులతో అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, లి పత్తి రైతులకు పత్తి అమ్మకం లో ఇబ్బందులు లేకుండా, మద్దతు ధర కు కొనుగోలు చేయాలన్నారు. ఖమ్మం జిల్లాలో 2025-26 సీజన్ లో 2 లక్షల 25 వేల 613 ఎకరాల్లో పత్తి పంట వేశారన్నారు. ఇందులో 27 లక్షల 7 వేల 356 క్వింటాళ్ల పత్తి దిగుబడి అంచనా ఉందన్నారు. 5 సిసిఐ కేంద్రాలు, 9 జిన్నింగ్ మిల్లుల వద్ద కొనుగోలు కు ప్రతిపాదించినట్లు తెలిపారు. నిబంధనల మేరకు పత్తి కొనుగోళ్లు చేయాలన్నారు. రైతులు కనీస మద్దతు ధర పొందడానికి ఆధార్ తప్పనిసరి అని అదనపు కలెక్టర్ అన్నారు. కపాస్ కిసాన్ యాప్ లో రైతులు నమోదవ్వాలన్నారు. మద్దతు ధర, తేమ శాతం, కొనుగోళ్లపై




విస్తృత ప్రచారం చేయాలని, వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులకు అవగాహన కల్పించి, చైతన్యపరచాలని అన్నారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, సజావుగా పత్తి కొనుగోళ్లు పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.ఏ. అలీమ్, సిపిఓ ఏ. శ్రీనివాస్, ఆర్టీఓ వెంకట రమణ, సిసిఐ జిల్లా ఇంచార్జ్ అవినాష్, ఎస్పి ఇన్స్పెక్టర్ రాజిరెడ్డి, విద్యుత్ శాఖ డిఇ రామారావు, మార్కెట్ కార్యదర్శులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# టీఎన్జీవోస్ మున్సిపల్ ఫోరం ఏకగ్రీవ ఎన్నిక

**టీ మీడియా, సెప్టెంబర్ 12,ఖమ్మం:**
నగరంలోని టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్ నందు ఖమ్మం జిల్లా టీఎన్జీవోస్ మున్సిపల్ ఫోరం ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలలో ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి, మధిర, వైరా, కల్లూరు, ఏదులాపురం, మరియు ఖమ్మం నగర పాలక సంస్థ లలో వివిధ స్థానాలలో పనిచేస్తున్న సభ్యులు పాల్గొన్నారు. సింగిల్ సెట్ నామినేషన్ రావటంతో ఏకగ్రీవంగా మున్సిపల్ ఫోరం ఎన్నికైనట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన టీఎన్జీవోస్ జాయింట్ సెక్రెటరీ తాళ్లూరి శ్రీకాంత్ ప్రకటించారు. ఎన్నిక అనంతరం జరిగిన కార్యక్రమానికి టీఎన్జీవోస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి కొనిదెన శ్రీనివాస్ లు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ, మున్సిపల్ ఫోరం ఎన్నికలు ఏకగ్రీవంగా జరగటం సంతోషంగా ఉందని, అందరూ ఐక్యంగా ఉంటూ సభ్యుల సమస్యల పట్ల స్పందిస్తూ, వారికి చేదోడు వాదోడుగా ఉండాలని, ఖమ్మం జిల్లా టీఎన్జీవోస్ ఎల్లప్పుడు మీకు అండగా ఉంటారని చెప్పారు.



టీఎన్జీవోస్ కార్యదర్శి కొనిదెన శ్రీనివాస్ మాట్లాడుతూ, మున్సిపల్ ఉద్యోగులకు అనేక రకాల ఒత్తిడిలు, సమస్యలు వస్తుంటాయని, ప్రజలకు మంచి సేవలు అందిస్తూ, మున్సిపల్ ఉద్యోగులకు కూడా నూతన ఫోరం అండగా ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ ఖమ్మం జిల్లా అసోసియేటెడ్ ప్రెసిడెంట్ కొమరగిరి దుర్గాప్రసాద్, టీఎన్జీవోస్ సెంట్రల్ కార్యదర్శి జెడ్. ఎస్. జైపాల్, టీఎన్జీవోస్ వైస్ ప్రెసిడెంట్లు యర్రా రమేష్, లలిత కుమారి, టీఎన్జీవోస్ నగర శాఖ అధ్యక్షులు ప్రభాకర చారి,రుక్మారావు, టీఎన్జీవోస్ నాయకులు దిలీప్ తదితరులు పాల్గొన్నారు. నూతన మునిసిపల్ ఫోరం బాధ్యులుగా ఈ క్రింది వారు ఏకగ్రీవంగా ఎన్నికైనారు. అధ్యక్షులుగా ఏ.సుధాకర్, అసోసియేటెడ్ అధ్యక్షులుగా ఈ.ఉదయ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్లు గా ఎం.శ్రీనివాస్, కె.లింగయ్య, జె. నాగరాజు,జె.సూచిత, సెక్రెటరీగా జి.శ్రీనివాసరావు, జాయింట్ సెక్రెటరీలుగా ఎం.సాంబయ్య, సిహెచ్. శ్రీనివాస్, జె.రాంబాయి, ఏ.ప్రేమ్ కుమార్ రెడ్డి, ట్రెజరర్ గా బి.నాగేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ గా బి.సుధాకర్, పబ్లిసిటీ సెక్రెటరీ గా కె.శ్రీకాంత్, స్పోర్ట్స్ సెక్రెటరీ గా అవినాష్, ఆఫీస్ సెక్రెటరీ గా కె. హేమనాథ్ సాయి, కార్యవర్గ సభ్యులుగా ఎం.ప్రవీణ్ కుమార్, పి.రజిని, కృష్ణకుమారి, కవిత, అనురాధ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

